17
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
గురువారం | 22 ఆగస్టు 2024 | పేజీలు 9


## రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

### ఈ-క్రాప్ నమోదులో రైతుల వివరాలను పక్కాగా నమోదు చేయండి... కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** బిందు, తుంపర్ల సేద్య పరికరాలు పంపిణీకి సంబంధించి రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో బిందు, తుంపర్ల సేద్య పరికరాల పంపిణీకి సంబందించి రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఈ-క్రాప్ బుకింగ్ సంబందిత అంశాలపై వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖలకు సంబంధించి జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిందు, తుంపర్ల సేద్య సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నదని, జిల్లాకు 2024-25 సంవత్సరంలో 21 వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్ణయించారని, ఇందులో ఇప్పటి వరకు 10 వేల హెక్టార్లకు 9,169 మంది రైతులు రిజిస్ట్రేషన్లు జరిగాయని మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రైతులకు అవగాహన కల్పించి రైతుల




మిగతా 2లో

# అపోలోలో వైద్యకళాశాలలో ఫుడ్ పాయిజన్

సుమారు 150 మెడికల్, నర్సింగ్ విద్యార్థిని విద్యార్థులకు అస్వస్థత

విద్యార్థులకు ఫుడ్ పాయిజన్‌పై పలు అనుమానాలు

తమ కళాశాలలో జరగలేదంటున్న యాజమాన్యం



వివరాలు 2లో

## పోలీసు శాఖలో అవినీతి సిబ్బందిపై ఎస్పీ వేటు

అవినీతి ఆరోపణలతో
ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హెూంగార్డు సస్పెన్షన్

విధి నిర్వహణలో పారదర్శకత, జవాబుదారితనం ముఖ్యం

ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ఎలాంటి ప్రవర్తనను సహించను

అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

జిల్లా పోలీసులకు ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు హెచ్చరిక

వివరాలు 8లో






### మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు

## సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలి

మాతా శిశు మరణాలు, మాల్ న్యూట్రిషన్ లేకుండా చర్యలు చేపట్టాలి

అంగన్వాడీ కార్యకర్తలు వారు విధులు నిర్వర్తిస్తున్న గ్రామంలో ఉండి సేవలు అందించాలి

కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా కృషి చేసి ప్రభుత్వాశయాలకు అనుగుణంగా మహిళల అభివృద్ధికి, శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతగా పనితీరు ఉండాలని, మాత శిశు మరణాలు మాల్ న్యూట్రిషన్ లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబందిత అధికారులకు సూచించారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు మహిళా అభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖపై సిడిపీఓలు సూపర్వైజర్లు డిసిపిఓ, డీఎం మహిళాప్రాంగణం వన్‌స్టాప్ సెంటర్ అధికారి తదితరులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా కృషి చేసి, ప్రభుత్వాశయాలకు అనుగుణంగా మహిళల అభివృద్ధికి, సాధికారతకు మరియు శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతగా పనితీరు ఉండాలని, మాతా శిశుమరణాలు, మాల్ న్యూట్రిషన్ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మాతా శిశు మరణాలు సంభవించకుండా ఆసుపత్రులలో ప్రసూతి కాన్పులు జరిగేలా చూడాలని ఆదేశించారు. మిషన్ వాత్సల్య పై సమీక్షిస్తూ సక్రమంగా అమలయ్యే

మిగతా 2లో




# అపోలో వైద్య కళాశాలలో ఫుడ్ పాయిజన్



**చిత్తూరు క్రైం, మేజర్‌న్యూస్:** వైద్య రంగంలో ఓ వెలుగు వెదురుతున్న ప్రముఖ కార్పొరేట్ వైద్య కళాశాల అయిన చిత్తూర్ అపోలో మెడికల్ కళాశాలలో బుధవారం ఆ కళాశాలలో వైద్య విద్యను, నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న సుమారు సుమారు 150 మంది విద్యార్థిని విద్యార్థులకు పైగా ఫుడ్ పాయిజన్ అయి తీవ్ర అసోస్తకు గురయ్యారు. దేశంలోని ప్రముఖంగా ఓ వెలుగు వెలుగుతున్న కార్పొరేట్ వైద్య కళాశాల అయిన అపోలోనే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంతో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. కళాశాల యాజమాన్యం తమ కళాశాలలో ఎలాంటి ఫుడ్ పాయిజన్ జరగలేదని పైకి బుకాయిస్తున్న విద్యార్థిని విద్యార్థులు మాత్రం తీవ్ర అస్వస్థతో విలవిలాడి పోతున్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్సను అందిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ వార్త గుప్పు మంటున్నా యాజమాన్యం మాత్రం తమ కళాశాలలో కానే కాదంటూ బయట ఎక్కడో విద్యార్థులు తిని అస్వస్థతకు గురైన చెబుతున్నారు. ఒకేసారి 150 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు కళాశాల క్యాంటీన్ వదిలి బయట వెళ్లి తినడం ఎంత మాత్రం నిజము కాదని మరి కొంతమంది ఆరోపిస్తున్నారు. గురువారం చిత్తూరు అపోలో మెడికల్ కళాశాలలో జరిగిన విద్యార్థిని విద్యార్థుల ఫుడ్ పాయిజన్ వివరాలను అక్కడి విద్యార్థిని విద్యార్థుల సమాచారం మేరకు ఇలా ఉన్నాయి. చిత్తూరు నియోజకవర్గం పరిధిలోని స్థానిక మురుకంబట్టు సమీపంలో ఉన్న అపోలో వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న మెడికల్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, అక్కడ సిబ్బంది కొంతమంది బుధవారం రాత్రి కళాశాల ఆవరణంలోని క్యాంటీన్ నందు భోజనం చేయడం జరిగిందన్నారు. రోజువారి భోజనంలో లాగానే బుధవారం రాత్రి కూడా భోం చేయడంతో అందరూ తమ తమ రూముల్లోకి వెళ్లి పడుకోవడం జరిగిందన్నారు. కాగా బోంచేసి పడుకున్న తర్వాత అర్ధరాత్రి సమయంలో తమ తోటి విద్యార్థిని విద్యార్థుల్లో కొంతమంది తీవ్ర వాంతులు విరోచనాలతో అల్లాడుచుండడంతో హాస్టల్ అధికారులకు తెలియజేయడంతో వారు హుటాహుటిన ప్రధమ చికిత్సను అందించి అక్కడి నుండి చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. అర్ధరాత్రి నుండి చాలామంది విద్యార్థిని విద్యార్థులు గురువారం సాయంత్రం వరకు తీవ్ర అస్వస్థతో వాంతులు విరోచనాలతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలిరావడంతో ఆసుపత్రి అంతా విద్యార్థిని విద్యార్థులతో నిండిపోయింది. ఈ విషయం గురువారం మధ్యాహ్నం వరకు ఎలాంటి సమాచారం మీడియాకు తెలియకుండా దాచడానికి ప్రయత్నించిన యాజమాన్యం ఎలాగో మీడియా దృష్టికి రావడంతో అసలు తమ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎలాంటి అస్వస్థతకు గురికాలేదని వారి బుధవారం రాత్రి బయటకు వెళ్లి స్వల్పహారాన్ని సేవించారని తద్వారా అస్వస్థత గురైనరని బుకాయిస్తూ పొంతనలేని సమాధానాలు ఇవ్వడం బట్టి చూస్తే యాజమాన్యం తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి చౌకబారు సమాధానాలు చెబుతున్నారని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొంతమంది ఇతర రోగులు ఆరోపిస్తున్నారు. అసలు బుధవారం రాత్రి వైద్య కళాశాల క్యాంటీన్ నందు ఎలాంటి వంటకాలు వండారు విద్యార్థులు ఏ వంట తిన్నారో అని కూడా వివరించడానికి ఆ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఏ సిబ్బంది సరైన సమాధానాన్ని ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా కొంతమంది చికిత్స పొందుతున్న విద్యార్థులు రాత్రి తాము పెరుగన్నం తినడం జరిగిందని ఆ పెరుగన్నం భుజించడం ద్వారా వాంతులు విరోచనాలు అధికమయ్యిందని అంటున్న యాజమాన్యం మాత్రం అలాంటివి ఏమీ జరగలేదని కరాకండిగా మీడియాకు చెప్పడమేనక యాజమాన్యం ఏదో దాచిపెడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫుడ్ పాసింగ్‌కు గురైన విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చిత్తూరు మురుగంపట్టు లోని అపోలో మెడికల్ కళాశాలలో నిన్నటి రాత్రి నుండి ఫుడ్ పాయిజన్‌కు గురిగి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైద్య కళాశాల విద్యార్థిని విద్యార్థులను నర్సింగ్ విద్యార్థులను గురువారం చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు. ముందుగా ఫుడ్ పాయిజన్ గురైన విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలను తక్షణం అందించాలని ఇక్కడ సరిపోకపోతే మెరుగైన చికిత్స కోసం ఇతర ఆసుపత్రిలో కూడా పంపాలని సూచించారు. అలాగే ఫుడ్ పాయిజన్ ఎలా జరిగిందని చికిత్స పొందుతున్న విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు రాత్రి కళాశాల క్యాంటీన్ నందు ఎలాంటి భోజనాలు వడ్డించారని కూడా అక్కడి యాజమాన్యాన్ని అడగడంతో కొంతమంది విద్యార్థులు క్యాంటీన్లో తినకుండా బయటికి వెళ్లి భుజించారని తద్వారా ఫుడ్ పాయిజన్ అయిందని యాజమాన్యం తెలియజేయడంతో దీనిపై పూర్తి విచారణ జరిపిన పిదప అసలు ఎలా జరిగిందో అనే విషయాన్ని తనకు తెలియజేయాలని శాసనసభ్యులు యాజమాన్యాన్ని కోరారు. అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో శాసన సభ్యులు గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ అపోలో వైద్య కళాశాలలో సుమారు 15 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు ఫుడ్ పాయిజన్ ద్వారా అస్వస్థకు గురయ్యారని తెలియడంతో హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకోవడం జరిగిందని తక్షణం విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆస్పత్రి ఉన్నత అధికారులకు సూచించానని తెలిపారు. అలాగే ఫుడ్ పాయిజన్ ఎలా జరిగిందో అని యాజమాన్యాన్ని అడగడం జరిగిందని వారు తమ క్యాంటీన్లో జరగలేదని విద్యార్థులందరూ బుధవారం రాత్రి బయటకి వెళ్లి తిన్నారని చెబుతున్నారని అయితే నిజ నిజాలను పూర్తిస్థాయిలో తెలుసుకొని తనకు సమాచారం ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. కాగా సుమారు 150 మంది పైగా విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నగా అందులో ఇద్దరికీ తీవ్ర అస్వస్థత ఏర్పడడంతో వారికి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాత్రికేయులకు తెలిపారు.





## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లాలో రోడ్లు, భవనాలకు సంబంధించి అభివృద్ధి



పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టర్ లోని సమావేశ మందిరం నందు రోడ్లు, భవనాల శాఖ అభివృద్ధి పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రోడ్లు, భవనాలకు సంబంధించిన ప్రైమరీ హెల్త్ సెంటర్ల నిర్మాణం, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లు, ఎంపీ లాండ్స్ ఫండ్స్, ఎన్‌డిబి, నాబార్డ్, తుడ తదితర అభివృద్ధి పనులను లక్ష్యం మేరకు వేగవంతం చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ఇంకా పూర్తి కానీ పనులను పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ అండ్ బి అధికారి మధుసూదన్ రావు, డివిజన్ స్థాయి ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## స్కూటర్లు ఢీ.. ఇద్దరికీ గాయాలు



**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలంలోని దుగరాజపట్నం గ్రామం వద్ద బుధవారం రెండు మోటార్ బైక్లు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఓ బైక్ ముందుభాగం నుజ్జునుజ్జయింది. దుగరాజపట్నం గ్రామానికి చెందిన వినోద్, కొండూరుపాలెం గ్రామానికి చెందిన సుధీర్‌లు బైకులు ఎదురుగా వెళ్లి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వీరిద్దరిని 108 వాహనంలో కోట ప్రభుత్వాసుపత్రికి ప్రాథమిక చికిత్స నిమిత్తం తరలించారు.

## రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖలకు చెందిన నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు సమిష్టిగా ఈ శాఖలకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకొని లక్ష్యాలను పూర్తి చేసేందుకు మరింత భాద్యతతో పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పొటెన్షియల్ ఉన్న మండలాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ద పెట్టి పనిచేయాలన్నారు. ఈ-క్రాప్ నమోదులో పంట సాగు చేస్తున్న రైతుల వివరాలను పక్కాగా నమోదు చెయ్యాలని ఏ పంట సాగు చేస్తున్నారో అనే విషయాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎటువంటి తప్పొప్పులకు తావు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,11,727 ఎకరాలలో అన్ని పంటలకు చెందిన ఈ-క్రాప్ నమోదు పూర్తయినదని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, వ్యవసాయ, ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, శోభారాణి, ఎపిఎంఐపీ పీడీ బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

విధంగా చర్యలు ఉండాలని మహిళా ప్రాంగణం ద్వారా మహిళలకు ఉపయోగపడే స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు మార్కెట్లో ప్రస్తుతం ట్రెండ్‌లో ఉన్న కోర్సులపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రానున్న మూడు నెలలలో మహిళా ప్రాంగణం, శక్తి సదన్‌ల నందు అనాధలు, వదిలి వేయబడిన వారు, భర్త లేని, సింగిల్ ఉమెన్ మహిళలకు 18 సం. నుండి 60 సం.లలోపు వారిని మరింత మందిని నిబంధనల మేరకు చేర్చుకుని వారికి వసతి, ఉచిత ఆహారం, ఆరోగ్య, వైద్య, లీగల్ సేవలు అందేలా చర్యలు చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న మూడు నెలల్లో పూర్తిస్థాయిలో సదనం పనిచేసేలా చూడాలని ఆదేశించారు సఖి సదనం, కళాశాల విద్యార్థుల సదనం ఇవన్నీ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకొని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తి బాలల సదనం పనితీరు మెరుగుపడాలని సూచించారు స్పెషల్ అడాప్షన్ ఏజెన్సీలో పోలీసు వారు గుర్తించిన బాలలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆమోదం మేరకు అనాథ పిల్లలు వదిలివేయబడిన పిల్లలు, తప్పిపోయిన పిల్లలను 18సంవత్సరాలు లోపు వారిని నిబంధనల మేరకు చిల్డ్రన్ హోం, అబ్జర్వేషన్ హోం నందు చేర్చుకుని తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ పిల్లలకు ఇచ్చే గుడ్లు సక్రమంగా అందేలా నాణ్యతగా ఉండేలా పర్యవేక్షించి చర్యలుతీసుకోవాలని సిడిపిఓలు సూపర్వైజర్లకు ఆదేశించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని, వాస్తవ వివరాలు తెలిపి అందులోని సమస్యలను అధిగమించి లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు అంగన్వాడీ కార్యకర్తలు వారు విధులు నిర్వర్తిస్తున్న గ్రామాలలో అందుబాటులో ఉండాలని సిడిపిఓలు సూపర్వైజర్లు ఎలాంటి కంప్లైంట్లు లేకుండా పనితీరు ఉండాలని ఆదేశించారు. బాల్య వివాహాలు జరగకుండా గ్రామాలలో అవగాహన కల్పించాలని సూచించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ మెటర్నిటీ ఆసుపత్రి పరిసరాల్లో ఏర్పాటు చేసిన దానిలో చేరే గృహ హింసకు గురైన,లైంగిక వేధింపులకు గురిఅయిన బాలలు, మహిళలకు వైద్య, లీగల్ పోలీస్ సంబంధ అంశాలలో సేవలు అందించాలనీ, సదరు సెంటర్ ఇంఛార్జి సంబంధిత అధికారులు బాధితులకు భరోసా కల్పించి వారికి అన్ని విధాలా అండగా నిలవాలని సూచించారు సిబ్బందికి సంబంధించిన అంశాలు సమన్వయం చేసుకుని అన్ని అంశాలలో పురోగతి ఉండేలా పనితీరు ఉండాలని సూచించారు జువెనైల్ జస్టిస్ బోర్డు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు అలాగే నిర్దేశించుకున్న 100 రోజుల లక్ష్యాలను సాధించేలా ప్రణాళికా బద్ధంగా పురోగతి సాధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, డిసిపిఓ శివ శంకర వన్ స్టాప్ సెంటర్ ఇన్చార్జి సిడిపిఓలో సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## పలమనేరు డీఎస్పీగా ప్రభాకర్



**పలమనేరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సాధారణబదిలీల్లో భాగంగా పలమనేరు డిఎస్పీగా ప్రభాకర్ వస్తున్నారు. ఈయన రాజమండ్రి ఎస్ బి నుండి పలమనేరుకు బదిలీపై రావడం జరిగింది. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ ఎస్సీ ఎస్టీ సెల్, కాకినాడకు రఘువీర్ విష్ణు బదిలీపై వెళ్ళనున్నారు.

## ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయాలి

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్.అశోక్ ఆధ్వర్యంలో మాల మహానాడు నాయకులు కార్యకర్తలు బుధవారం రోజున పట్టణంలో ర్యాలీ నిర్వహించి బంద్ నిర్వహించారుఅశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని ఈ తీర్పును రద్దు చేయాలని వారు కోరారు.

## ఎమ్మెల్యేకి 14వ వార్డు ప్రజలు కృతజ్ఞతలు

శ్రీకాళహస్తి మేజర్ న్యూస్: శ్రీకాళహస్తి పట్టణం 14 వవార్డు ప్రజలు పలు ప్రజా సమస్యలను



ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడం జరిగింది. సంవత్సరాల కాలం నుండి మూల పడిన తాగునీటి బోర్ రిపేర్‌లో ఉన్నది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 14వ వార్డ్ సీనియర్ నాయకులు మాజీ శ్రీకాళహస్తి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు వాకిచర్ల గురప్ప శెట్టి. మాజీ శ్రీకాళహస్తి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు కాసరం రమేష్ దృష్టికి ప్రజలు తీసుకురావడం జరిగింది. వాకిచర్ల గురప్ప శెట్టి బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వెనువెంటనే సంబంధిత మునిసిపల్ అధికారులకు రిపేర్ చేయాలని ఆదేశించారు. మునిసిపల్ అధికారులు వెంటనే బోరు మరమ్మతులు చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## ధర్మరాజులు దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తాం : ఎమ్మెల్సీ

**కుప్పం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పెద్ద బంగారనత్తం గ్రామ పంచాయతీలో ప్రసిద్ధి గాంచిన ధర్మరాజులు దేవాలయంలో నూతనంగా ప్రారంభమైన పనులును కుప్పం నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ బుధవారం పరిశీలించారు. ఆలయాన్ని సందర్శించి ఆలయ పనులను పరిశీలించి ఆలయానికి కావాల్సిన వసతులు ప్రభుత్వం తరపున దేవాలయ



నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ హార్థిక సహాయం కల్పిస్తామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ విషయంపై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపిపార్టీల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదప్రజలకు అన్నదానం

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** తిరుపతి అనంత వీధికి చెందిన ఆముదాల మురుగయ్య



నాలుగవ వర్ధంతి సందర్భంగా బుధవారం మెటర్నిటీ హాస్పిటల్ వద్ద దాదాపు 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన నాయకులు రాజారెడ్డి, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ విచ్చేసి మాట్లాడుతూ ఆముదాల మురుగయ్య కుమారులు ఆముదాల వెంకట కృష్ణ, ఆముదాల జయచంద్ర తండ్రి జ్ఞాపకార్థం వర్ధంతి సందర్భంగా పేద ప్రజల ఆకలి తీర్చడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మురుగయ్య కుటుంబ సభ్యులు ఆముదాల వెంకట కృష్ణ, జయచంద్ర, టీడీపీ నాయకులు సుబ్బుయాదవ్, యతీంద్ర షణ్ముగం, గాజుల వెంకటేష్, చెరుకుల వెంకటేష్, శంకర్ యాదవ్, సుబ్రహ్మణ్యం, బాబు, మునిరాయల్, మధు యాదవ్, చెంగారెడ్డిలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శమని అయితే ఆ కుటుంబ వ్యవస్థకు మూలాధారం వృద్ధులేనని రాయలసీమ రంగస్థలం. చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ వృద్ధులదినోత్సవాన్ని పురస్కరించుకొని రిటైర్డ్ ఉపాధ్యాయులు విద్వాన్ కస్పా పద్మనాభంను రంగస్థలం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి వృద్ధులను సత్కరించారు. రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి వృద్ధులు భారం కాదని వారి అనుభవం దేశాభివృద్ధిలో ఎంతో కీలకమన్నారు. కని,పెంచి, పెద్ద చేసి ప్రయోజకులను చేసిన తల్లిదండ్రులను నేటి యువత వృద్ధాశ్రమాలలో వదలడం బాధాకరమన్నారు. వృద్ధులను గౌరవించి సమాజాభివృద్ధిలో వారిని భాగస్వామ్యం చేసినప్పుడే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్ రాయలసీమ రంగస్థలం చైర్మన్ గోపీనాథ్ రెడ్డి, గౌరవ సలహాదారులు సుబ్బరామయ్య సుబ్రహ్మణ్యంయాదవ్ సభ్యులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజు, పనిభూషణరెడ్డి పాల్గొన్నారు.



# మోడీని గద్దె దింపితేనే ఏపీకి ప్రత్యేక హోదా

### కాంగ్రెస్ సీనియర్ నేత తులసీరెడ్డి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపితే తప్ప ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా సాధ్యం కాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసీ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కేంద్రంలో కాంగ్రెస్‌ను గెలిపించడం అనివార్యమని స్పష్టం చేశారు. స్థానిక పీపుల్స్ నర్సింగ్ హోమ్‌లో పీసీసీ కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడుతో కలిసి తులసీ రెడ్డి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి 70 రోజులు దాటాయనీ, సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల్లో పెన్షన్ పథకం అమలు హర్షణీయమే అయినా తక్కిన పథకాల సంగతేంటని ప్రశ్నించారు. అమ్మఒడిని ఆటకెక్కించి తల్లులకు వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ముగిసిపోయే దశకు చేరుకున్నా ఇంకా పెట్టుబడి సాయం ఏమైందంటూ విమర్శలు చేశారు. నిరుద్యోగ భృతి, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, 19-59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్, ఉచిత బస్సు ప్రయాణం పథకాలు అమలు చేస్తారా? లేదా? అని ప్రశ్నించారు. చేసేట్టుగా ఉంటే తేదీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. తప్పు చేసి పప్పు కూడు తింటున్న సీఎం చంద్రబాబు రోజుకో శ్వేత పత్రాలతో సాకు పత్రాలు విడుదల చేసి రాష్ట్ర ఖజానా ఖాళీ అంటూ పలాయన వాదం ఎత్తుకోవడం సిగ్గు చేటని మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు స్పందించి సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటముని, రమణయ్య నాయుడు, వడివేలు, చిరంజీవులు, మోహన్, శివయ్య, రాఘవ రెడ్డి, నాగూర్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

### తెలుగుదేశం నేత గాలి మురళి నాయుడు

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** గ్రామపంచాయతీలు అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంపై తొట్టంబేడు మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు అనందం వ్యక్తం చేశారు. గాలి మురళి నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జగన్రెడ్డి స్తానికి సంస్థల నిధులు ఎనిమిది వేల కోట్ల రూపాయలు దారి మళ్లించి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరాగానే స్థానికి సంస్థలను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది. అందులో భాగంగా పద్నాలుగు వందల కోట్ల రూపాయలు కేటాయించడం చాల అనందకరమన్నారు. గత ప్రభుత్వాధినేత జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు పరిపాలనకు తేడాను రాష్ట్ర ప్రజలంతా చుస్తున్నారన్నారు. స్థానిక సంస్థల బలపరుస్తూ చేస్తూన్న అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని అభినందిస్తూ తెలుగుదేశంపార్టీ తరపున ప్రజలు తరపున హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. అదేవిధంగా 19వ తేదీన శ్రీసిటీలో పలు పరిశ్రమలకు ప్రారంభోత్సవం చేసి కొత్తగా ఒప్పందాలను కుదుర్చుకొని పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూ యువతకు ఉద్యోగ, ఉపాది అవకాశాలను కల్పిస్తూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు. అలాగే తొట్టంబేడు మండలంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సహకారంతో ప్రభుత్వం ద్వారా జరగాల్సిన అభివృద్ధి ఇతర కార్యక్రమాల గ్రామాలలో కూడా వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు.

## సంతానం ముగ్గురుంటే సర్పంచ్ పదవికి అనర్హులా

### పంచాయతీరాజ్ చాంబర్ చైర్మన్ ఎలమంచిలి



**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులకు లేని ఆంక్షలు ముగ్గురు సంతానం కలిగి ఉంటే సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు అనర్హులని పేర్కొనడం హాస్యాస్పదమని పంచాయతీరాజ్ ఛాంబర్ చైర్మన్ ఎలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. ఇలాంటి ఆంక్షలను ఎత్తివేయాలని కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా ముందు సింగంశెట్టి సుబ్బరామయ్య, ప్రశాంత్ రెడ్డి, నాగేందర్ రెడ్డి తదితరులతో కలిసి ఎలమంచిలి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో 2014-15కు సంబంధించిన ఆర్థిక నిధులను మాజీ సీఎం జగన్ హైజాక్ చేశాడని ఆరోపించారు. ఉపాధి హామీ నిధులతో పాటు తమ న్యాయమైన 16డిమాండ్లను నెరవేరుస్తున్నారని కొనియాడారు. కూటమి పాలనలో ఇప్పటికే తమ సంఘానికి రావాల్సిన నిధులు చేరుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సంఘానికి వైసీపీ చేసిన మోసానికి చర్యకు ప్రతిచర్య తప్పదన్నారు.

## గైడ్ టీచర్స్‌కు శిక్షణ

కార్వేటినగరం, మేజర్‌న్యూాస): గైడ్ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని రాజా కుమార్ స్వామి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షణా కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రమణ మాట్లాడుతూ విద్యార్థుల మదిలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం, సమాజానికి మేలు చేసే ఆలోచనలకు రూపమివ్వడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందనీ ఇది ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది మరియు ఆవిష్కరణ వైపు వారిని నడిపిస్తుంది. వీటిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ పర్యవేక్షిస్తుంది అని తెలిపారు శిక్షణా కార్యక్రమానికి అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలల ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల రెసిడెన్నియల్, కస్తురిబా, మున్సిపల్, మోడల్ స్కూల్స్, ట్రైబల్ వెల్ఫేర్, ఎయిడెడ్, ప్రైవేట్) గైడ్ ఉపాధ్యాయులు సుమారు 107 మంది పాల్గొన్నారు .జిల్లాలో 2024-25 ఇన్‌స్పైర్ నామినేషన్‌లను తప్పనిసరి చేయాలి. 2024-25 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాజెక్ట్ నామినేషన్లను పూర్తి చేయాలి. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్లు సెప్టెంబర్ 15 చివరి తేదీలోపు ఇన్స్పైర్ మనక్ సైట్‌లో అప్లోడ్ చేయాలి. ఏ పాఠశాలకు ఇలాంటి మినహాయింపు లేదు. ప్రతి ఒక్కరూ భాగస్వాములను కలిగి ఉండాలి. ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లను తెరిచి పాఠశాలల వివరాలను నమోదు చేయండి. జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు సైన్స్ ఉపాధ్యాయులు, హెచ్ఎంలు కృషి చేయాలి అని జిల్లా సైన్స్ ఆఫీసర్ తెలిపారు. డీఈఓ సీ.దేవరాజు ప్రతి పాటశాల నుంచి తప్పని సరిగా నామినేషన్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ ఆర్‌వి.రమణ మండల విద్యాశాఖ అధికారులు విజయ్ కుమార్ మనోజ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, డైట్ లెక్చరర్ చంగల్ రాజు, తిరుమల రాజు, ఆర్‌పీలు నందకుమార్, ఉమశంకర్, భవాజాన్, శివలింగం పాల్గొన్నారు.



# విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదు

## -సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా - ఎమ్మెల్యే అమర్

**పలమనేరు మేజర్‌న్యూస్ :** హాస్టల్ విద్యార్థులకు ఏమాత్రం ఇబ్బందులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వార్డన్లదేనని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ బీసీ ఎస్సీ వసతి గృహ సలహా సంఘం



సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైఆయన మాట్లాడుతూ... హాస్టలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. నియోజకవర్గంలోని హాస్టళ్ళ వారీగా విద్యార్థుల సంఖ్యను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైతే ఖాళీలు ఏర్పడ్డాయో అక్కడ విద్యార్థులను భర్తి చేయాలని సూచించారు. ఇక పక్కాభవనాలు లేక ప్రైవేటు భవనాలలో హాస్టళ్ళ ను నడుపుతున్నామని కొత్త భవనాలను ఏర్పాటు చేయించాలని పలువురు వార్డన్లు కోరారు. ఇక పట్టణంలోని బీసీ హాస్టల్ పురాతన భవనం కావడంతో ఉరుస్తోందని మరమ్మతులు చేయించాలని అధికారులు కోరారు. దీనిపై స్పందించిన ఆయన కొత్త భవనాల ఏర్పాటుతో పాటు హాస్టల్లో సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని హాస్టలల్లో ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇక విద్యార్థుల మెనూ ను సక్రమంగా పాటించాలని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసే పనులు చేయొద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ రోజా, ఎంపీడీవో రాజేష్, ఎంఈఓ బాల సుందరం, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జగ్గయ్య, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ హైమావతి, సోమ సుందరం, లతో పాటు నియోజకవర్గంలోని బీసీ,ఎస్సీ హాస్టల్లో వార్డెన్లు పాల్గొన్నారు.

# శివయ్య సేవలో కోటిలింగ మహా క్షేత్రం పీఠాధిపతి

**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ :** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంనకు రాజధాని అమరావతికి సమీపం తాళ్లాయి పాలెం కోటి లింగ మహాక్షేత్రం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శివస్వామి బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వారికి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి స్వామి అమ్మవార్లను దర్శనం చేయించారు. స్వామితో దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు ప్రయాణికులు సలహా మండలి సభ్యులు అయితా మురళీకృష్ణ కూడా ఆయనకు స్వాగతం పలికారు. శ్రీ శుకబ్రహ్మాశ్రమం తరపున ఆయనకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ శివ స్వామి మాట్లాడుతూ సమాజంలోని అందరూ గోవులను రక్షించాలని, హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని కోరారు. ధర్మాన్ని ఆచరించడమే



కాకుండా దైవం పట్ల భక్తి, గౌరవం కలిగి ఉండాలని, సేవాభా వం కలిగి ఉండాలని సూచించారు. హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ తమ వంతు బాధ్యత కలిగి ఉండాలని, ధర్మానికి ఆపద కలిగినప్పుడు చైతన్యం రావడం కాకుండా ముందుగానే పరిరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కోటిలింగ మహా క్షేత్రం ద్వారా గోసం, హిందూ ధర్మ పరిరక్షణకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు స్వామి తెలిపారు.

# ఐటీ-మల్టీ నేషనల్ కంపెనీ అయిన జెన్ ప్యాక్ట్ లో ఉద్యోగాలపై పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి బ్యూరో మేజర్ న్యూస్ :** ప్రముఖ ఐటీ-మల్టీ నేషనల్ కంపెనీ అయినా జెన్ ప్యాక్ట్ (Genpact)లో ఉద్యోగాల కొరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జెన్ప్యాక్ట్ లో కంటెంట్ మోడర్ణయిజేషన్, కస్టమర్ సర్వీస్- వాయిస్ సపోర్ట్ ఉద్యోగాల కొరకు తయారు చేయబడిన పోస్టర్‌ను తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. బుధవారం



సాయంత్రం స్థానిక కలెక్టరేట్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జెన్ప్యాక్ట్ లో కంటెంట్ మోడర్ణయిజేషన్ మరియు కస్టమర్ సర్వీస్- వాయిస్ సపోర్ట్ ఉద్యోగాల కొరకు తయారు చేయబడిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ జిల్లాలోని బీటెక్ ఏ గ్రూప్ అయినా, లేదా ఏదైనా డిగ్రీలో 2022 లేదా 2023 లేదా 2024వ సంవత్సరంలో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1500 ఖాళీలు ఉన్నాయని, ఉద్యోగం హైదరాబాద్ నందు కల్పించబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇంటర్వ్యూనకు హాజరయ్యే యువతీ యువకులు క్రింద తెలుపబడిన రిజిస్ట్రేషన్ లింక్ లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి,ఆర్ లోకనాథం తెలిపారు. మరిన్ని వివరాలకు కింద తెలుపబడిన మొబైల్ నెంబర్లను సంప్రదించగలరు. అలాగే రిజిస్ట్రేషన్ లింకు: https://bit.ly/46Wzqz6. రిజిస్ట్రేషన్ కోసం చివరి తేదీ ఈనెల 28తేదీ. ఇతర వివరాలకు ఈ ఫోన్ నెంబర్‌కు 9988853335 సంప్రదించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అర్హత పరిశీలించి, ఇంటర్వ్యూ జరుగు స్థలము పూర్తి వివరాలను తెలియజేస్తారు. ఈ కార్యక్రమంలో పి.మురళి క్రిష్ణ ఏడిఎస్డి,ఏ.గణేష్ డిపిఓ దిలీపు, మహేష్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

### తమ సమస్యలు పరిష్కరించాలని

# రుయా ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్ల నిరసన

## - సంఘీభావం తెలిపిన పులివర్తి సుధా రెడ్డి...

**తిరుపతి, రెవెన్యూ మేజర్‌న్యూస్:** రుయా ఆసుపత్రి సమస్యలు పరిష్కరించాలని జూనియర్ డాక్టర్లు బుధవారం పులివర్తి సుధా రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆమె జూనియర్ డాక్టర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూపరింటెండెంట్ దృష్టికి తీసు కెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటన పట్ల విచారణ వ్యక్తం చేసిన సుధా రెడ్డి. ఇటు వంటివి పునరావృతం కాకుండా చట్టాలలో మార్పులు తేవాలన్నారు. కలకత్తా లోని ఆర్.జి.కె.ఎ.ఆర్ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలుపై జరిగిన అత్యాచార ఘటన నిరసిస్తూ తిరుపతి రుయా ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు "న్యాయం కోసం నిరసన" చేపట్టారు. ఈ కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి ఆస్పత్రి ఆవరణలో నిరసన చేపడుతున్న జూనియర్ డాక్టర్లకు సంఘీభావం తెలియజేశారు. జరిగిన సంఘటన చాలా దారుణమైనదని ఇలాంటివి పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని, తప్పు చేసిన వారికి శిక్ష పడేల చట్టంలో మార్పులు తేవాలని డిమాండ్





చేశారు. వైద్య విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మొదటగా చట్టాలు మారాలనీ, అంతవరకు మన జాగ్రత్తలలో మనం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మొదటగా జూనియర్ డాక్టర్లకు పని గంటలు కుదించే విధంగా, భద్రత, వసతుల గురించి పోరాటాలు చేపట్టాలని తెలిపారు. మొదటగా తన పరిధిలో ఉన్న రుయా ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లకు కావలసిన మౌలిక వసతులు గుర్తించి వాటిని సూపర్డెంట్ రవి ప్రభు దృష్టికి తీసుకెళ్లారు. అందులో ముఖ్యంగా ఆసుపత్రి ఆవరణలో సీసీ కెమెరాలు, పోలీసు పెట్రోలింగ్, మహిళ పోలీసులు , ఆసుపత్రి సిబ్బందికి ప్రతి ఒక్కరికి ఓ గుర్తింపు కలిగిన స్టిక్కర్లు ఇవ్వాలని, నియర్ డాక్టర్లు విశ్రాంతి తీసుకోవడానికి తగిన సదుపాయాలను కల్పించి వారికి ఓ మహిళా పోలీసులు కూడా అందుబాటులో ఉంచాలని పులివర్తి సుధా రెడ్డి సూపర్డెంట్ ను కోరారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి ముందుంటానని సూపర్డెంట్ కు తెలిపారు. పోలీసు శాఖ వారి సహకారం కూడా అవసరం ఉన్నందున తిరుపతి ఎస్పీ కి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కోరుతానన్నారు.

# అమరావతిపై ఉన్న శ్రద్ధ 10 శాతం సీమపై పెట్టండి

## టిడిపికి కాంగ్రెస్ విన్నపం

**తిరుపతి ప్రెస్ క్లబ్ మేజర్ న్యూస్ :** ప్రస్తుత ప్రభుత్వం ఏపీ రాజధాని అమరావతి పైన పెడుతున్న శ్రద్ధను కనీసం 10% రాయలసీమపై




పెట్టి లిసీమను అభివృద్ధిలి చేయాలని.. కాంగ్రెస్ పార్టీ మీడియా సెల్ చైర్మన్ తులసి రెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్క్లబ్లో బుధవారం మీడియా ముందు కాంగ్రెస్ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి తదితరులతో కలిసి తులసి రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న 9 ప్రధానమైన , న్యాయమైన .డిమాండ్లను కూటమి ప్రభుత్వం అమలు పరచాలన్నారు. కడపలో స్టీల్ ప్లాంట్ వస్తే సీమలో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించాలన్నారు. అలాగే నిలిపివేసి ఉన్న తెలుగు గంగా , గాలేరు నగిరి, హంద్రీనీవా ప్రాజెక్ట్ పనులను పూర్తి చేసి తాగునీరు అందించాలన్నారు. రాయ లసీమను రాజధానిగా, సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు. వైయస్సార్ పాలనలో అనుకున్న కడప రాయచోటిల మీదుగా రైల్వే బ్రాడ్ గేజ్ లైన్ తీసుకురావాలన్నారు. ఇలా నష్టపోయి ఉన్న రాయలసీమ ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

# అన్న క్యాంటీన్‌ను సందర్శించిన కమిషనర్

**పలమనేరు మేజర్‌న్యూస్ :** పట్టణంలో ప్రతిరోజు పలమనేర్ మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పరవేక్షణలో భాగంగా గురువారం అన్నా క్యాంటీన్‌ను సందర్శించారు.చడం జరిగిందన్నారు. అక్కడ ప్రజల రద్దీని పర్యవేక్షించి వంట పదార్థాలను పరిశీలించడమైనది. అనంతరం ఆర్కే స్ట్రీట్ సచివాలయం పాతపేట సచివాలయంలో హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం జరిపి ఇంకను పూర్తికాని గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏ ఈ రూపేష్, మేనేజర్ మొహిదీన్ ,తదితరులు పాల్గొన్నారు.



## అలిపిరి సిఐగా రామ్ కిషోర్



మంగళం మేజర్ న్యూస్ : అలిపిరి సిఐగా రామ్ కిషోర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రామ్ కిషోర్ ఈస్ట్ సిఐగా, సిఐడి సీఐగా విధులు నిర్వహించి మంచి అధికారిగా పేరు పొందారు. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు కు తావు లేదన్నారు.

## 23న ఉపాధి పనులపై గ్రామ సభలు

**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు మంజూరు కోసం ఈనెల 23న మండలంలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏవో కే హరిబాబు నాయుడు బుధవారం తెలిపారు. గ్రామ సభలకు వ్యవసాయాధికారి వనిత, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, పంచాయతీరాజ్ ఏఈ మురళి, ఈవోపీఆర్డి పురుషోత్తం, ఉపాధి హామీ పథకం జే ఈ మునిరత్నం, ఏపీవో ఇందు ఇన్చార్జిలుగా వ్యవహరిస్తారని ఏవో హరిబాబునాయుడు తెలిపారు.

## డ్రోన్ సాంకేతికత పై అవగాహన, పిచికారీ ప్రదర్శన



**కార్వేటినగరం మేజర్ న్యూస్:** రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు మండలంలోని రాజుల కండ్రిగ, ఎం. కృష్ణాపురం, ఆర్.కే.వి.బి పేట గ్రామాల్లో వ్యవసాయంలో డ్రోన్ ల వినియోగంపై అవగాహన కల్పించి సామూహిక మొదటి తరహా ప్రదర్శనా క్షేత్రాలలో భాగంగా వేరుశనగ పొలాలలో డ్రోన్ వినియోగించి పురుగుమందులు , పోషకాల పిచికారీ ప్రదర్శన నిర్వహించినట్లు విస్తరణ శాస్త్రవేత్త శ్రీ రాము కుమార్, సేద్య విభాగ శాస్త్రవేత్త డా.దివ్య తెలిపారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ పిచికారీ కి ప్రధాన సమస్యగా ఉన్న కూలీల కొరతకు ఈ డ్రోన్ సాంకేతికత చాలా ఉపయోగకరమని, 6 నుండి 8 నిమిషాలలో కేవలం 10 లీటర్ల నీటితో ఒక ఎకరా పిచికారీ చేయగలమని, పురుగుమందు మోతాదు కూడా 20 నుండి 25 శాతం తగ్గుతుందని, పురుగుమందు ప్రభావం కూడా మామూలు పద్ధతికన్న అధికంగా ఉంటుందని తెలిపారు. అవగాహన కార్యక్రమం తరువాత గ్రామాలలోని 20 ఎకరాల వేరుశనగ పొలాలలో డ్రోన్ ద్వారా పిచికారి చేసారు. కార్యక్రమంలో కే.వి.కే శాస్త్రవేత్తలు రాముకుమార్, డా.దివ్య, రైతు సమాఖ్య ప్రెసిడెంట్ నాగేశ్వర రాజు, కే.వి.కే సిబ్బంది చందు, రైతులు పాల్గొన్నారు.

## కార్వేటినగరం ఎస్ఐగా రాజ్ కుమార్



కార్వేటినగరం (మేజర్ న్యూస్): మండల ఎస్సైగా రాజ్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎస్ఐ వెంకటేశులు బదిలీ కావడంతో కొంత కాలం పాటు ఏఎస్ఐ మునికృష్ణ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎస్సై రాజ్ కుమార్ ఎస్బి ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై కార్వేటినగరం బాధితులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి పద్ధతుల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## గుంతల మయమైన రోడ్లు ఆదమరిస్తే బోల్తా...



**పుంగనూరు మేజర్‌న్యూస్:** పుంగనూరు నుండి రామసముద్రం వైపు వెళ్లే రోడ్డులో ప్రసన్నయ్య గారి పల్లి దగ్గర హంద్రీనీవా కాలవ డ్యామ్ ముందుఉన్న రోడ్డు గుంతలమైనది ప్రతినిత్యం స్కూల్ బస్సులు, వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుం టాయి గుంతలు ఎక్కువగా ఉండటం వల్ల వాహన చోదకు లు ఆదమరిస్తే బోల్తా పడే అవకాశం ఉంది సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడిపించాల నివాహన చోదకులు కోరుతున్నారు.

## ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకోండి



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం సూచినల మేరకు తిరుపతి గ్రాసమ్ సంస్థచే ఏర్పేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దీర్ఘకాలిక వ్యాధులైన హెచ్ఐవి. ఎయిడ్స్, టిబిల గురించి సంస్థ మేనేజర్ రమేష్ వివరించడం జరిగింది.కారణాలు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సవివరంగా తెలపడం అయినది. తదనంతరం ఉపాధ్యాయుల. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. ప్రధానోపాధ్యాయులు సుమతి, ధరణి, మంజుల ఇతర ఉపాధ్యాయులు సంస్థ సిబ్బంది కన్నయ్య పాల్గొన్నారు.

## సహకార ఓటర్లూ...ఈకేవైసీ చేసుకోండి

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్ :** ప్రాథమిక సహకార సంఘంలో ఓటు హక్కు కలిగిన మండలంలోని రైతులు అందరూ తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని స్థానిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో ఓటు హక్కు ఉన్న ప్రతి రైతు ఆధార్ కార్డు,పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పుస్తకం జిరాక్సుకాపి తో ఈనెల 30వ తేదీ లోగా ఈకేవైసీ చేసుకోవాలని స్థానిక సీఈఓ కోరారు.

# తిరుపతిలో భారత్ బంద్ విజయవంతం



**తిరుపతి రెవెన్యూ మేజర్ న్యూస్:** ఎస్సీ వర్గీకరణ లో క్రిమిలేయర్ ద్వారా రిజర్వేషన్ పూర్తిగా రద్దు చేయాలి అనే కుట్రపూరితమైన తీర్పుకు వ్యతిరేకంగా ఈరోజు దళిత వర్గాలు పెద్ద ఎత్తున భారత్ బంద్ చేపట్టింది ఎస్సీ ఎస్టీ కులాలను విభజించి పాలించు అనే ధోరణిలో బిజెపి ఆర్ఎస్ఎస్ పార్టీలు, సుప్రీంకోర్టు తీర్పు దళితుల సామాజిక వర్గాన్ని చాలా అణిచివేతకు గురిచేస్తున్నారు తిరుపతి అంబేద్కర్ భవన్ కమిటీ ప్రెసిడెంట్ పరమశివం, భవన్ సెక్రటరీ నాగేశ్వరరావు మరియు ఇంద్రముని, సబ్ కమిటీ రాధాకృష్ణ, సురేష్ , చెన్నకేశవులు,కాణిపాకం రాజేష్, సమతా సైనిక్ దళ్ రెడ్డప్ప చిరంజీవి, రాజేష్, టిటిడి దళిత సంఘ నాయకులు ప్రసాద్ రావు, బీసీ కే పార్టీ అధ్యక్షులు రమేష్, ప్రభు, రజిని సదాశివ, సుబ్రహ్మణ్యం, సుబ్బు, కృష్ణమూర్తి శివమణి బంద్‌లో పాల్గొన్నారు భారత్ బంద్ నిరసన ర్యాలీ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్షలు చేసి తరువాత అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా రైల్వే స్టేషన్ ఎన్టీఆర్ సర్కిల్ జ్యోతిరావు పూలే సర్కిల్ ఎస్వీ యూనివర్సిటీ మహిళా యూనివర్సిటీ పంచాయతీరాజ్ ఆఫీస్ ఆర్డిఓ ఆఫీస్ టీటీడీ పరిపాలన భవనం గవర్నమెంట్ స్కూల్ లను బందు చేయించి నిరసన తెలియజేశారు. దళితులతో చెలగాటమాడితే రాజకీయ పార్టీలకు మూల్యం చెల్లించడం జరుగుతుందని బిఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు ఎత్తివేయాలని చూస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారు అని గర్జించారు. సుప్రీంకోర్టు వర్గీకరణ పై సరైన తీర్పు ఇవ్వాలని లేని ఎడల దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు బందులు చేస్తామని దళిత వర్గాలు తెలియజేస్తున్నాయి.

## ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును వెంటనే రద్దు చేయాలి

కార్వేటినగరం మేజర్‌న్యూస్: మాల మహానాడు ఆధ్వర్యంలో అసంబద్ధమైన సుప్రీంకోర్టు తీర్పును రద్దుచేసి మాల మాదిగల ఐక్యత వర్ధిల్లాలని భారత్ బంద్ సందర్భంగా కార్వేటినగరంలోని నాయకులు పేర్కొన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని పరిపాలించే నాయకులు అణగారిన వర్గాలైనటువంటి మాల మాదిగల పట్ల ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక ,రాజకీయ రంగాలలో అవకాశాలు కల్పించాలని ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు వర్తింపజేసి అట్టడుగు స్థాయిలో ఉన్న దళితులకు తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అదేవిధంగా ఓపెన్ కేటగిరీలో ఉన్నటువంటి ఎమ్మెల్యే ఎంపీ స్థానాలలో దళితులకు కూడా అవకాశాలు ఇచ్చి వారు కూడా ఆ స్థానాలలో పోటీ చేసే విధంగా ప్రధాన రాజకీయ పార్టీల అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. చట్టాలు చేసే నాయకుల వద్ద గల వందలాది ఎకరాల భూములను భూమిలేని నిరుపేదలైన దళితులకు పంచగలరా అని ప్రశ్నించారు. ఎంతో పేదరికంతో అల్లాడుతున్నటువంటి మాల మాదిగలను విడగొట్టి రాజకీయ లబ్ధి కోసం వారిలో అనైక్యతను దెబ్బతీసి కొంతమంది స్వార్థ రాజకీయాలు చేయాలనే పనిని మేము ఎప్పటికీ స్వాగతించమని మా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని తెలియజేశారు. ఈరోజు ఎంపీలు ,ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రుల కొడుకులు ఒకటి కాదు రెండు కాదు ఎన్నిసార్లు అయినా వాళ్ళు పదవులు అనుభవించొచ్చు. మరి అలాంటిది క్రిమిలియర్ చట్టం ద్వారా ఒక అటెండర్గా ఉద్యోగంలో చేరినటువంటి దళితుడు ఆ తర్వాత వారి కుటుంబ సభ్యులు ఎవరికీ కూడా రిజర్వేషన్ వర్తింపజేయకుండా చట్టం చేయడం అనేది ఎంతవరకు న్యాయమని దళిత నాయకులు చలపతిరావు ప్రశ్నించారు. మా దళితుల పొట్ట కాడ కూటిని ఎవరు లాక్కున్న సహించబోమని ఈ సందర్భంగా దళిత నాయకులు దొరబాబు పేర్కొన్నారు. ఏబిసిడి విభజన వద్దు ఐక్యతే ముద్దు అనే నినాదంతో కార్వేటి నగరము జాతీయ రహదారి పైన సుమారు ఐదు గంటలసేపు బంద్ నిర్వహించి రాకపోక లను స్తంభింప చేశారు. ఈ సందర్భంగా సుమారుగా మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపో యాయి. ఆ తరువాత గౌండ్ల మెట్ట కూడలి నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వో గారికి వినతి పత్రం అందజేసి కార్యాలయాలన్నిటిని కూడా మూసి వేయడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలు కాలేజీలకు సెలవు ప్రకటించి బందును విజయవంతం చేశారు. అనంతరం తాసిల్దార్ గుణవతికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదాం సుందర్ రాజ్, దినకర్ ,వెంకటేశు, అమర్నాథ్, రాము, కిరణ్, దొరబాబు, నాగరత్నం ,రవి, నరేష్, ప్రవీణ్, మురగయ్య ,చరణ్ నాయకులు పాల్గొన్నారు.



## సుప్రీం తీర్పుపట్ల పోరాటం ఆగదు



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం భారత్ బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పలమనేరు నియోజక వర్గం పెద్దపంజాణి మండల కేంద్రంలో మలమానాడు మండల అధ్యక్షుడు మంజునాథ్ ఆధ్వర్యంలో స్థానిక తాహసిల్దార్ వారి కార్యాలయం వద్దగల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించి శాంతియుత నిరసన తెలియజేశారు. అనంతరం పుంగనూరు - పలమనేరు జాతీయబీరహదారిపై శాంతియుత ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు గొప్పదా? రాజ్యాంగం గొప్పదా? అని ప్రశ్నించారు .ఇప్పుడు సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అనేది రాష్ట్రాలకు అధికారం లేదని పార్లమెంట్ 1/3 వంతు ఆమోదం తెలపాలని ఈ విషయం చాలా సంవత్సరాల నుండి ప్రతి ఒక్క జస్టిస్ వారు,ప్రభుత్వాలు కూడా తెలిపాయన్నారు. ఇప్పుడు వచ్చిన మోడీ ప్రభుత్వం మనువాదంతో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనువాదం తేవాలని చూస్తూ ఎస్సీలను విడగొట్టి వర్గీకరణ చేస్తామని తెలుపుతున్నారని తెలిపారు. ఆర్టికల్ 341 మరియు 14 ప్రకారం వర్గీకరణ జరగదని తెలిపారు. వర్గీకరణ అనేది పార్లమెంట్ ఆమోదంతో జరుగుతుందని మోడీ చెప్పిందే ఇప్పుడు కోర్టులు కూడా వారి మాట ప్రకారం చేస్తామని అనుకుంటున్నారు. వర్గీకరణ అనే విషయం సున్నితమైనదని దేశంలోనే ప్రథమమైనదిని ఇది అన్ని రాష్ట్రాల్లో మాల మహానాడు ఉద్యమాలు రాస్తారోకోలు ప్రారంభిస్తామని చెప్పారు. మాలలు అందరూ ఒక తాటిపైకి వచ్చి ఈ యొక్క వర్గీకరణను అడ్డుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రచార కార్యదర్శి తిప్పన్న, యూత్ లీడర్ పి .వెంకటేష్ సంఘ సభ్యులు శివన్న, తోటి మునిరత్నం,నాగరాజ, రెడ్డప్ప,బయప్ప, చంద్ర,రంగప్ప తిరువలప్ప, దళిత సేవా సంఘం అధ్యక్షులు కృష్ణప్ప ,కదిరప్ప బాలాజీ ,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లుకు అవగాహన

**సూళ్లూరుపేట మేజర్‌న్యూస్ :** సూళ్లూరు పేట మున్సిపాలిటి ' హెూలీ క్రాస్ ' వై జంక్షన్ మన్నారు పోలూరు తది తర ప్రాంతాల్లో బుదవారం సూళ్లూరు పేట ఎస్సై బ్రహ్మనాయుడు వాహన దార్ల కు ట్రాఫిక్ నిబందనల పై అవగాహన సదస్సు నిర్వహించారు ముఖ్యంగ ఆటో డ్రైవర్ల ప్రయాణికుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి తెలియ చేశారు ఆటోలో అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్న ఆటోను ఆపి అందులో ఉన్న ప్రయాణికులను క్రిందకి దిగమని ' ఏదైన ప్రమాదం జరిగితే మిమ్మలను నమ్ముకున్న వారి పరిస్థితి గూర్చి ఆలోచించాలన్నారు ఆటోలకు ముఖ్యంగ ఇన్సూ రెన్సు డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని అన్నారు . అంతే కాకుండా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత మోటర్ బైక్ 'ఆటో కారు ర్యాష్ డ్రివంగ చేయకూడదని చూచించారు అదేవిధంగ బైక్ నడిపె ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పని సరిగా ఉండాలన్నారు.

## 2970 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

**తడ మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని అక్కంపేట వద్ద తడ ఎస్సై పి.నరసింహారావు తన సిబ్బందితో వాహనాలను తనిఖీలు నిర్వహిస్తుండగా తడ నుండి నెల్లూరు వైపు వెళుతున్న ఓ మినీ వ్యానులో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి వాహనాన్ని ఆపి తనిఖీ చేయడానికి అవి రేషన్ బియ్యం అని నిర్ధారించి డ్రైవర్ని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ఇవి ఆంధ్ర రేషన్ బియ్యం అని ఈ బియ్యం సూళ్లూరుపేటకు చెందిన దిలీప్ అనే వ్యక్తి అని డ్రైవర్ తెలిపారు . 2970 కేజీల రేషన్ బియ్యం విలువ సుమారు ఒక లక్ష తొమ్మిది వేల ఎనిమిది వందల రూపాయలు విలువ ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి నరసింహారావు తెలిపారు.



## మున్సిపల్ అనుమతులు లేని లేఔట్‌లో ప్లాట్లు కొనరాదు



**పుంగనూరు మేజర్‌న్యూస్** :మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ నరసింహ ప్రసాద్ రెడ్డి పట్టణంలో వేసిన అక్రమ లేఔట్ లపై మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణపరిధిలో రియల్ ఎస్టేట్ దార్లు వేసినా 17 లేవటల్లో ఏ ఒక్క దానికి మున్సిపల్ అనుమతులు లేవన్నారు ప్రజలు ఈ లేవులలో ఎటువంటి కొనుగోలు జరపరాదని హెచ్చరిస్తున్నామన్నారు ఈ లేఔట్లలో ప్రజలు కొనుగోలు చేసిన ఇల్లు నిర్మించుకోవడాని మున్సిపల్ శాఖ అప్రూవల్ ఇవ్వదన్నారు అక్రమంగా వేసిన లేఔట్ యజమానులపై సివిల్ కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు.

## భావితరాల కోసం వృక్షాలను రక్షిద్దాం

**చిత్తూరు అర్బన్ మేజర్‌న్యూస్:** భావితరాల భవిష్యత్తు కోసం వృక్షాలను రక్షించడంతోపాటు కొత్త మొక్కలను నాటాలని శిఖండి మూవీ డైరెక్టర్ కోడి కిషోర్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నగరం లోని స్థానిక లక్ష్మీ నగర్ కాలనీ నందు గల చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ను ఆయన కార్యాలయం నందు కలసి దుశ్యావతో సన్మానించి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో పచ్చదనం కరువైపోయిందని వాతావరణంలో వేడి శాతం 45 డిగ్రీల నుండి 48 డిగ్రీల వరకు ఎండ వేడిమి పెరిగిందని, ఇందుకు కారణం పచ్చని వృక్షాలను నిష్కారణంగా తొలగించడం, వాటి స్థానంలో నూతన మొక్కలను నాటకపోవడం ఇందుకు కారణం అన్నారు. ఈ కార్యక్రమం లో గంజి రామమూర్తి ఏ కే మురుగ, టీవీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధురాలి మెడలో చైన్ లాక్కెళ్లిన ఆగంతకుడు



**గంగవరం మేజర్ న్యూస్ :** ఓ ఆగంతకుడు ఓ వృద్ధురాలి మెడలో బంగారు చైను లాక్కెళ్ళిన సంఘటన మండలంలోని కలగటూరు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు పోలీసులకు తెలిపిన ఫిర్యాదు మేరకు వివరాలు...మండలంలోని కలగటూరు మాజీ సర్పంచ్ లెట్ తిమ్మారెడ్డి భార్య నాగమణి (70), అనే వృద్ధురాలు గ్రామంలోని తన ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో వృద్ధురాలు నాగమణి శ్రావణమాసం సందర్భంగా బుధవారం వేకువజామున 4:30 గంటలకు బ్రహ్మ ముహూర్తం లో బాత్రూంలో స్నానం చేస్తుండగా ఎవరో గుర్తుతెలియని ఆగంతకుడు స్వెటర్ చేతికి గ్లౌజులు తలకి మంకీ క్యాప్ ధరించి హఠాత్తుగా బాత్రూం లోకి ప్రవేశించి తన మెడలో ఉన్న 35 గ్రాముల బంగారు చైన్ లాక్కొని, చేతిలో ఉన్న బంగారు గాజులు కూడా లాక్కోవడానికి ప్రయత్నించగా తాను గట్టిగా కేకలు వేయడంతో ఆగంతకుడు బంగారు చైన్తో పరారైనట్లు బాధిత వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. గంగవరం అర్బన్ సిఐ బొడ్డు ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పనుల ఎంపికపై ఉపాధిహామీ గ్రామసభలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల గుర్తింపుపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వెంకటేశ్వరారవు తెలిపారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించాలన్నారు. ఆయా గ్రామసభలకు మండల స్థాయి అధికారుల ఆద్వర్యంలో బృందాలుగా ఆయా సచివాయల పరిధిలో సర్పంచ్‌ల అధ్యక్షతన సమావేశాలు నిర్వహిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులు, స్థానికులు ఆయా గ్రామాల్లె పనులు గుర్తించి సబ ఆమోదం పొందాలని అనంతరమే ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

**చిల్లకూరులో:** చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలోనూ ఉపాధి హామీ పనుల గుర్తింపుపై ఇఒపిఆర్‌డి మాణిక్యం ఆద్వర్యంలో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని 31 పంచాయతీల్లో ఏ విధంగా సభలు నిర్వహించాలి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనులు గుర్తించాలని సూ,చించారు. ఈ సమావేశంలో ఎపిఓ గిరిబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, టిసిలు పాల్గొన్నారు.



## వీధి కుక్కలు పట్టివేత

**పలమనేరు మేజర్ న్యూస్ :** 20వ తేదీ అనిమల్ కేర్ ల్యాండ్ తిరుపతి వారి నుండి వచ్చిన వీధి కుక్కలను పట్టు వ్యాన్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ చాముండేశ్వరి ప్రారంభించారు. పట్టణంలోని లక్ష్మీ నగర్ అంబేద్కర్ నగర్ జండా మఠం రంగబాబు సర్కిల్ జే ఎస్ నగర్ ఆర్కె స్ట్రీట్ ఎందు పట్టుకొని తిరుపతిలోని అనిమల్ కేర్ ల్యాండ్ కు తరలించి వాటికి వ్యాక్సిన్, స్టీరిలేషన్ చేసి మరలా వారం రోజుల తర్వాత అదే ప్రదేశంలో విడిచి పెట్టు దరు. 23వ తేదీ ఉదయం 10 గంటలకు యూ పి హెచ్ సి కాకా తోపు నందు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలమనేరు పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులకు తమిళనాడులోని వేలూరు సిఎంసి డాక్టర్లచే వారికి వైద్య పరీక్షలు నిర్వహించబడును. కావున ఈ అవకాశాన్ని కార్మికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఏఈ రూపేష్, మేనేజర్ మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలసిన భవన నిర్మాణ సంఘ నాయకులు



**గూడూరురూరల్, మేజర్‌న్యూస్:** గూడూరు డివిజన్ పరిధిలో ఇసుక విషయంలో భవన నిర్మాణ సంఘ నాయకులు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ను కలసి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం ఎంఎల్‌ఏ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసిన భవన నిర్మాణ సంఘం నాయకులు ఉచిత ఇసుక విషయమై వారు పొంతన లేని సమాధానాలు తో దాటవేస్తుండడంతో రక రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులు ఇసుక కొరతతో పనులు లేక నానా ఇబ్బందులు పడుతూ కుటుంబాలు పస్తులు ఉంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అనంతరం సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని ఉచిత ఇసుక విషయంపై వినతి పత్రం సమర్పించడం జరిగింది. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ జిల్లా అధికారులతో మాట్లాడి తొందర్లో ఉచిత ఇసుక ఏర్పాట్లు చేయగలమని, కార్మిక సోదరులకు ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘ నాయకులు అధ్యక్ష,కార్యదర్శులు, రఫీ, సేలం సేకరాచారి, జిలాని బాయ్, అబ్దుల్లా, భవన నిర్మాణ వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య, గూడూరు శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ వద్దు -కలసి ఉండటమే ముద్దు



**చౌడేపల్లి మేజర్‌న్యూస్:** ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ చౌడేపల్లి బస్టాండ్‌లో మాలమాలహానాడు నాయకులు బంద్ కార్యక్ర మం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు యల్లకుంట్ల శివకుమార్ మాట్లాడుతూ గౌరవ సుప్రింకోర్టు ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇచ్చిన తీర్పును వెంటనే రద్దు చేయాలని, వర్గీకరణ వద్దు కలసి ఉండటమే ముద్దు అలా చేయని పక్షంలో ఈ నిరసనా కార్యక్రమాలు ఇలానే కొనసాగుతాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చౌడేపల్లి లో అంబేద్కర్ నామస్మరణ మార్మోగింది. ఈ కార్యక్రమం లో మాలమహానాడు జిల్లా ఉపాధ్యాక్షులు శివకుమార్, మాలమహానాడు మండల అధ్యక్షులు కొత్తపల్లి మణి, ఉపాధక్షులు కూరపర్తి ఈశ్వర్, రాము నాయనివారిపాళ్యం, రెడ్డి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బత్తలాపురం విజయ్, జనరల్ సెక్రటరీ ఎల్లకుంట్ల సురేష్, మండల యూత్ ప్రెసిడెంట్ ముకుంద, యూత్ వైస్ ప్రిసిడెంట్ ఎల్లకుంట్ల మణి, ప్రచార కార్యదర్శి గడ్డంవారిపల్లి రాజశేఖర్, అమినిగుంట వేణుగోపాల్, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు. తదుపరి బస్టాండ్ నుండి ర్యాలీగా మండల రెవెన్యూ కార్యాలయానికి వెళ్ళి తహాశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

## రైతులకు ముఖ్య గమనిక

**యాదమరి మేజర్ న్యూస్ :** యాదమరి మండలం కాశిరాళ్ల గ్రామ రైతు సేవా కేంద్ర పరిధి లో జరిగే ఈ పంట నమోదు, APMIP డ్రిప్ రిజిస్ట్రేషన్లు , గ్రామ పరిధిలో ఐదు సంవత్సరాలుగా సాగు చేయని బీడు భూములు ను గుర్తించే కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పరిశీలించి తగిన సూచనలు చేశారు. గ్రామంలో వేసిన పంట మొత్తం ఈ పంటలో నమోదు చేయాలని VAAకు సూచించారు. అలాగే పంట వేసిన ప్రతి రైతు కూడా తమ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అందువలన పంట నష్టం జరిగినపుడు పెట్టుబడి రాయితీ పొందవచ్చని, పంటల బీమాకు అర్హులవుతారని, పంట రుణం తీసుకోవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ పథకం కింద అర్హులైన రైతులందరూ డ్రిప్ ఇరిగేషన్ కొరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీ , 10 ఎకరాలలోపు ఉన్న రైతులకు 70 శాతం రాయితీ, పది ఎకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి ఉమా గారు,గ్రామ రైతులు, మండల వ్యవసాయ సిబ్బంది, గ్రామ వీఆర్ఓ పాల్గొన్నారు.



## తెలియక ఇచ్చిన మాటకు కట్టుబడిన అర్జునుడు



**రామచంద్రపురం మేజర్‌న్యూస్ :** మహాభారతం ఎన్నో నీతివంత ప్రబోధాలకు పెట్టింది పేరు. కృష్ణార్జునలు చక్కటి మిత్రులు. వారిరువురు నరనారాయణులుగా పేరుగాంచారు. అయినా వారి మధ్య ఓ సంఘటన యుద్ధానికి దారి తీసింది. గయుడు అనే రాజు ఆకాశంలో సతీమణితో వెళుతూ ఉమ్మి వేయటం,దానిని వాయు దేవుడు పనిగట్టుకుని రెండు చేతులతో గంగను తీసుకుని సూర్యునికి అర్ఘ్యం సమర్పిస్తున్న సమయంలో అందులో గయుడు ఉమ్మిన ఎంగిలి పడెటట్లు చేయటం,దాని ఆగ్రహించి గరుడుని చంపుతానని శ్రీకృష్ణుడు శఫదం చేయటం,ఆ విషయం తెలిసి నారదుడి సూచనతో అర్జునుడుని శరణు కోరటం. తీర విషయం తెలుసుకున్న అర్జునుడు చింతించటం. అయిన ఆర్తత్రణపరాయణతకే అర్జునుడు కట్టుబడి శ్రీ కృష్ణుడుతో యుద్ధనికి పూనుకోవడం,దేవతలు వారిద్దరిని మధ్య మార్గంగా యుద్ధ విరమణ చేయించటం వంటి ఘట్టలను సి రామాపురం మహా భారత ఉత్సవాలలో బుధవారం మధ్యాహ్నం అనసూయ భాగవతారని హరికథగా ఆలాపించారు రాత్రి శ్రీ వెంకటేశ్వర కళానాట్యమండలి వారు పౌరాణిక నాటకంగా ప్రదర్శించారు. శ్రీరామపురంకు చెందిన డి రామకృష్ణయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు హరిప్రసాద్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దలు భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

## కొత్తగా ఓటు నమోదు చేసుకోండి

**గుడిపాల, మేజర్ న్యూస్:** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని గుడిపాల తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలో జరుగుతున్న ఇంటింటికి సర్వేను ఆయన బుధవారం పేయనపల్లి గ్రామంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా ఇంటింటి వెళ్లి పరిశీలించి కొత్త ఓటు నమోదు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ అవకాశాన్ని 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈయన వెంట పేయనపల్లి సర్పంచ్ సంగీత సురేష్ ,బిఎల్ వోలు వెంకట రత్నమ్మ, లోకేష్, జూనియర్ అసిస్టెంట్ దుర్గలు ఉన్నారు.



## వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టర్‌లోని సమావేశ మందిరంకలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో పనులలో భాగమైన 7 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లకు నీటి సరఫరా పనులు, భూసేకరణ, ఆక్రమణల విషయాలపై విసిఐసి,రెవెన్యూ, పిడి, నేషనల్ హైవే, ఎస్‌ఈ, నీటి పారుదల, డీఎఫ్‌ఓ, అడవులు తదితర శాఖల వారితో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ సతీష్, గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నెల్లూరు విజయ రత్నం, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ చంద్రశేఖరయ్య, తెలుగు గంగప్రాజెక్టు ఎస్ఇ మదన్‌మోహన్, ఏపీఐఐసి స్పెషల్‌డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం డీటీ స్వామినాథన్ పాల్గొన్నారు.



## పోలీసు శాఖలో అవినీతి సిబ్బందిపై ఎస్పీ వేటు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తీవ్రమైన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరిపి వెంకటగిరి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు రమణ, మస్తాన్‌లను విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు బుధవారం రోజున అదేశాలు జారీచేశారు. వెంకటగిరి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్ల తమదైన శైలిలో అవినీతికి పాల్పడుతూ స్టేషన్‌కు వచ్చు ఫిర్యాదుదారులకు న్యాయం చేయకపోగా వారి బాధలను వీరికి అవసరాలుగా మలుచుకొని యదేచ్ఛగా అక్రమాలకు పాల్పడినట్టు, గతంలో కూడా వీరిద్దరిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నట్లు, దర్యాప్తుల్లో తేలిందని జిల్లా ఎస్పీ అన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్, స్క్రాప్ ఓనర్స్ నుండి అక్రమ వసూళ్లకు పాల్పడిన హోంగార్డు. నాలుగు నెలల క్రితం కూడా హోంగార్డు చిన్న తంబి శ్రీసిటీ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ నుండి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నాడు. దీనిపై క్రమశిక్షణ చర్యలో భాగంగా బదిలీపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు బదిలిచేశారు. ఇక్కడ కూడా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ తన ప్రవృత్తిని కొనసాగించాడని దర్యాప్తులో తెలిసింది.



దుష్ప్రవర్తన, అవినీతికి సంబంధించిన బలవంతపు వసూళ్లకు పాల్పడిన హోం గార్డ్‌ను ఎస్పీ కఠిన చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు. పోలీస్ శాఖ యొక్క సమగ్రత చాలా ముఖ్యమైనది. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఏ ప్రవర్తన అయినా చాలా తీవ్రంగా పరిగణిస్తానన్నారు. ప్రతిఒక్కరూ సమగ్రత, వృత్తి నైపుణ్యం యొక్క అత్యున్నత ప్రమాణాలను పాటించాలని, అవినీతికి పల్పడకూడదన్నారు. అవినీతిని, అక్రమవసూళ్లు, నెల మామూళ్లను సహించేది లేదుని, ఏ స్థాయి అధికారి అయిన ప్రజల నమ్మకాన్నివమ్ము చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని, ఈ సస్పెన్షన్ ఒక్కటే కాదని అవసరమైతే ఇంకా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలతో మమేకమై చట్ట ప్రకారం సేవలు అందిస్తూ పోలీసు ఖ్యాతిని పెంచే విధంగా జిల్లా పోలీసులు పని చేయాలన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడానికి, అందరికీ న్యాయమైన వ్యవస్థను ఏర్పాటు చేయటానికి పోలీస్ యంత్రాంగం అవిశ్రాంతంగా పని చేస్తుందని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట అరుంధతి వాడ మహిళలు నిరసన

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్ం** గూడూరు ఒకటో పట్టణ పరిధిలోని. అరుంధతి వాడికి చెందిన ఒక యువకుడు. ప్రేమ పేరుతో ఒక యువతిని గర్భం దాల్చి మోసం చేశాడంటూ అరుంధతి వాడ మహిళలు బుధవారం రాత్రి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రేమించి పెళ్లి చేసుకుంటానని గోవిందు ప్రశాంత్ మోసం చేశాడన్నారు. రెండు సంవత్సరాలు తనతో ప్రేమ వ్యవహారం, సహజీవనం నడిపించి నడిరోడ్డులో వదిలేశాడని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు వారాల నుండి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న



పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. యువతకి మాయ మాటలు చెప్పి ఆరునెల గర్భం తీపించేశాడన్నారు. మళ్లీ యువతితో సహజీవనం చేసి ఇప్పుడు రెండో నెల గర్భం దాల్చిందన్నారు. యువతికి తెలియకుండా చాటుమాటుగా కోట పట్టణంలో మరో అమ్మాయితో ప్రశాంత్ నిశ్చితార్థం చేసుకున్నాడని ఆరోపించారు. ఇది ఎక్కడి న్యాయం అని ఆ యువతి ప్రశ్నించగా నేను నిన్ను చేసుకోలేను ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరిస్తున్నాడన్నారు.



## కలెక్టర్లతో సీఎస్ వీసీ

**23న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీలలో గ్రామ సభలు నిర్వహించి గ్రామ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి**

**జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం, ఈనెల 23నుండి జరిగే గ్రామసభలపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత కమిషనర్లు, కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జెసి శుభం బన్సల్‌తో కలిసి సంబంధిత అధికారులతో హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈనెల 23న జిల్లాలో అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి గ్రామ అభివృద్ధి సంబంధిత పలు అంశాల ఆమోదం పొందాలని సూచించారు. ఇందులో ప్రతి గృహానికి కనీస అవసరాలు, గ్రామ అవసరాలు, రోడ్ కనెక్టివిటీ, విలేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నరేగా అంశాలపై చర్చించాలని, దీని ద్వారా గ్రామవిజన్ డాక్యుమెంట్ తయారు అవుతుందని తెలిపారు. మొదటగా ప్రతి ఇంటికి కనీస వసతులైన రక్షిత మంచినీటి కొళాయి కనెక్షన్, ఎల్‌పిజి గ్యాస్, కరెంట్ కనెక్షన్ మరుగుదొడ్లు ఉండేలా, గ్రామానికి సంబంధించి డ్రైనేజీ, వీధి దీపాలు, సిమెంట్ రోడ్లు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ఏర్పాటు ఉండేలా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అంతర్గత



రోడ్లు, ఆసుపత్రి, పాఠశాల ఏర్పాటు, గ్రామాలకు కనెక్టివిటీ ఫారం పాండ్లు, కుటుంబ ఆదాయ పెంపుదల కార్యక్రమాలు అయిన పశువులకు షెడ్, పశు సంపద గొర్రెల పెంపకం, ఉద్యానవన, సెరికల్చర్ పంటల సాగు వంటివి ప్రోత్సహించడం, నరేగా కింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి పనులను గుర్తించి చేపట్టనున్న వేజ్ ఎంప్లాయిమెంట్, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వంటి అంశాలు గ్రామ సభలో చర్చించి తీర్మానం చేయాలి. ప్రతి గ్రామాన్ని స్వర్ణ గ్రామంగా మార్చేందుకు ప్రతిపాదనలు గ్రామ సభలో చర్చించి ప్రణాలికలు ఆమోదించాలనీ తదనుగుణంగా సదరు ఫోటోలు, గ్రామ సభల రిజల్యూషన్లను సంబంధిత వెబ్సైట్ నందు అప్లోడ్ చేయాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఉచితఇసుక విధానం అమలు మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పిడి డ్వామా శ్రీనివాసప్రసాద్, జిల్లా పరిషత్ సిఈఓ గ్లోరీ, డిప్యూటీ సిఈఓ ఆది శేషారెడ్డి, జిల్లా పంచాయితీ అధికారిణి సుశీల దేవి, అధికారులు పాల్గొన్నారు.

## పీఎంఏవై పథకం ఇళ్లలో స్టేజ్ కన్వర్షన్ జరగాలి

**పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తికి చర్యలు చేపట్టండి**

**చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు కలెక్టరేట్ మేజర్‌న్యూస్:** జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం కింద మంజూరైన ఇండ్లలో స్టేజ్ కన్వర్షన్ ఖచ్చితంగా జరగాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గృహ నిర్మాణశాఖ అధికారులు ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం కింద జిల్లాకు కేటాయించబడ్డ ఇండ్ల పురోగతిపై గృహ నిర్మాణశాఖ పిడి, ఈఈ, డిఈ, ఎఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా పథకం క్రింద మంజూరైన గృహాల పూర్తికి సంబంధించి స్టేజ్ కన్వర్షన్ జరగాలని లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణానికి సంబందించిన ఆర్థిక సాయంను సంఘాల ద్వారా



అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సి, ఎస్టి, పేదలకు ఇండ్లు మంజూరయినప్పటికి ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న కారణంగా ఇంటి నిర్మాణాలు చేపట్టకపోవడం ప్రధాన కారణంగా ఉంటుందని, క్షేత్రస్థాయి ఎంపిడిఓలు, గృహనిర్మాణ శాఖ అధికారులు పర్యటించి లబ్ధిదారుల వారీగా వారి సమస్యలను గుర్తించి అందుకు చర్యలు చేపట్టడం ద్వారా గృహ నిర్మాణాల పురోగతికి అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా అధికారులు పని చేయాలన్నారు. బిల్లులు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఎక్స్పెండీచర్ బుకింగ్ కచ్చితంగా జరగాలన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్‌తో అనుసందానంతో పని దినాలను కల్పించి ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని క్షేత్ర స్థాయిలో ఇసుకకు సంబందించి ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడం జరుగుతుందని, మండల స్థాయిలో ఎంపిడిఓ హౌసింగ్, ఎపిడి, ఎపిఎంలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, హౌసింగ్ పిడి పద్మనాభం, ఎంపిడిఓలు, ఇతర గృహ నిర్మాణశాఖ ఈఈ, డిఈలు పాల్గొన్నారు.



జనం కోసమే
నేటి దినపత్రిక సూర్య
విలేఖరులు కావలెను
నేటి దినపత్రిక సూర్యలో
తిరుమలలో పనిచేయుటకు
ఉత్సాహవంతులైన యువకులు కావలెను.
తిరుమల ఆర్‌సీ ఇన్‌చార్జ్,
తిరుమల విలేఖరి
ఫొటో గ్రాఫర్
కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116

# సుప్రీంకోర్టు తీర్పును వెనక్కి తీసుకోవాలి



**చిట్టమూరు మేజర్‌న్యూస్:** ఎస్సీ,ఎస్టీలకు ప్రస్తుతం ఇస్తున్న రిజర్వేషన్లలో మార్పులకు రాష్ట్రాలకు హక్కులు కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చిట్టమూరు కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం చిట్టమూరు మండల కేంద్రం కూడలి ప్రాంతంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మానవహారంగా ఏర్పడి,నినాదాలు చేస్తూ,వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రిజర్వేషన్ రక్షణ కోసం దేశంలో పోరాటం చేస్తున్న రిజర్వేషన్ బచావో సంఘర్స్ సమితి పిలుపు మేరకు భారత్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చిట్టమూరు మండల శాఖ అధ్యక్షులు బందిలి శ్రీను,ప్రధాన కార్యదర్శి సురేష్,రమేష్,క్రాంతి, చిరు,మురళిలతో పాటు మాల సామాజిక వర్గాల నేతలు,స్థానిక వ్యాపారస్తులు,ఆటో డ్రైవర్స్ పలువురు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ బహుకరణ



**గూడూరురూరల్ మేజర్‌న్యూస్ :** గూడూరు ప్రగతి సేవా సంస్థఆధ్వర్యంలో బుధవారం గూడూరు బాలాజీ నగర్ లోని ప్రగతి ఆఫీస్ లో ఎండీ వాసు, హైదరాబాద్ "తల్లిదండ్రుల జ్ఞాపకార్థం "నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన ఆశ అనే ఒక మహిళకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఒక లికుట్టు మెషిన్ ను శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ చేతులమీదుగా బహుకరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, సభ్యులు రామ్మోహన్రావు, శ్రీనివాసులు , కె ఆర్ ఎం.ప్రభాకర్ , కుమార్ నాయుడు నక్క రామకృష్ణ, శ్యామ్, శివకుమార్ రెడ్డి , కోట వెంకటేశ్వర్లు, డీన్ శ్రీహరి, పోతిరెడ్డి పెంచలయ్య, కృష్ణారెడ్డి , సంచి ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసు పై డీఎస్పీ విచారణ



**పెళ్లకూరు మేజర్‌న్యూస్:** మండలంలోని శిరసనంబేడు రాజుపాలెం గ్రామానికి చెందిన ఇటుక బట్టీ యజమాని కానూరు రాజుపాలెం గిరిజనులను వెట్టి చాకిరి చేయించడం,కులం పేరుతో దూషించడం, మహిళలను వేధించడంపై స్థానిక ఎస్సై కే శ్రీకాంత్ ఇటుక బట్టి యజమానిపై అట్రాసిటీ కేసుతోపాటు పలు సెక్షన్ ల కింద కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు కానూరు రాజుపాలెం గిరిజన ప్రాంతానికి చేరుకొని కేసు పై విచారణ చేపట్టారు. అయన వెంట ఎస్సై కే శ్రీకాంత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోషి బాయ్ , గ్రామ రెవెన్యూ అధికారి సుమతి, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా భారత్ బంద్..



**తిరుపతి సిటీ ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్:** ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు, జైబీమ్ పార్టీ, చేపట్టిన భారత్ బంద్ తిరుపతిలో పాక్షికంగా సాగింది.. పలువురు దళిత నాయకులు తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ లో బస్సులను నిలిపివేశారు .అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి బందుకు సహకరించాలని కోరారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేసు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అనేది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. గతంలో కూడా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను తోచుపొచ్చిందని అయితే ప్రధాని నరేంద్ర మోడీ కుట్రపూరితంగా దళితులను విభజించాలన్న కక్షతో ఎస్సీ వర్గీకరణ చేయించారని ఆరోపించారు. అన్నదమ్ముల వలె ఉన్న మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టి ఎస్సీ వర్గీకరణ పేరుతో విభజించి పాలించడానికి నరేంద్ర మోడీ కుట్రపన్నారని త్వరలో పూర్తిగా రిజర్వేషన్లు ఎత్తివేసి ఆలోచనలో భాగంగానే నేడు ఎస్సీ వర్గీకరణ చేపట్టారని పేర్కొన్నారు.

## శ్రీకాళహస్తిలో భారత్ బంద్ విజయవంతం



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ :** ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ బందులో భాగంగా శ్రీకాళహస్తిలో బుధవారం బంద్ విజయవంతంగా జరిగింది. భారత్ బంద్ నేపథ్యం లో పట్టణంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలలో అన్ని మూతపడ్డాయి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జై భీమ్ ఆర్మీ, అంబేద్కర్ మిషన్ ఆధ్వర్యంలో వర్గీకరణకువ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుమారు గంటపాటు ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. విద్యార్థులతో కలిసి మానవహారం తెలిపారు. పట్టణంలో పలు విద్యాసంస్థల వద్దకు వెళ్లి పాఠశాల, కళాశాలలోని విద్యార్థులను బయటకు పంపి బంద్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పులి శ్రీకాంత్ దళిత నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఒకటిగా ఉన్న మాల మాదిగలు ను చీల్చి రాజకీయం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయ న్నారు. అన్నదమ్ములగా ఉన్న మాల మాదిగలను విడదియాలనే కుట్రను ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలన్నారు. కూలీ రవికుమార్, సైమన్ శ్రీనివాస్,పోతల చంద్ర, పెరిమిడి రఘు, బావులూరి అంకయ్య, అక్కుర్తి శివ, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడు పంచాయితీలు అభివృద్ధికి నిధులు కేటాయించడంపై హర్షం

## - తెలుగుదేశం నేతరెడ్డివారి గురువారెడ్డి



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** ఏర్పేడు మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో తెలుగుదేశం పార్టీ నేత రెడ్డి వారి గురవారెడ్డి పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించరు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్థానిక సంస్థల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంపై హర్షం చేశారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 72 రోజులు పూర్తయి ప్రజలకు సంబంధించినటువంటి సంక్షేమ అభివృద్ధి మీద శాంతి భద్రత మీద పెట్టుబడి ఏవిధంగా ఈ రాష్ట్రానికి తీసుకుని సంపద సృష్టించాలని దానిమీద అనునిత్యం ముఖ్య అధికారులతోనూ పెట్టుబడేదారులతోనూ మంత్రివర్గ సభ్యులతో ఒక జవాబుదారీగా రివ్యూస్ పెట్టుకొని ఎక్కడికి ఎక్కడ అధికారులను ప్రజాప్రతినిధులను చైతన్యవంతులు చేసి ముందుకు నడిపించడం జరుగుతున్నది. జగన్మోహన్ రెడ్డి సంస్థల నిర్వీర్యం చేస్తే స్థానిక సంస్థల కొరకు 1452 కోట్లు వాటి అభివృద్ధి కొరకు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంది అన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల బలవపదం చేస్తూ అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని అభినందిస్తూ తెలుగుదేశం పార్టీ తరపున ప్రజలు తరపున వర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. 2019 నుండి 24 వరకు పరిపాలన చేసినటువంటి సైకో ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో స్థానిక సంస్థల నిధులను ఎనిమిది వేల కోట్లను దారి మళ్లించి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అవమానించింది వాస్తవం కాదా అన్నారు. అదేవిధంగా 19వ తేదీన శ్రీసిటీలో పలు పరిశ్రమలకు ప్రారంభోత్సవం చేసి కొత్తగా ఒప్పందాలను కుదుర్చుకొని పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ సంపద సృష్టిస్తూ ముందుకు వెళుతున్న ప్రభుత్వం చంద్రబాబునాయుడు గారు ప్రభుత్వం అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు అదేవిధంగా మండలంలో ప్రభుత్వం ద్వారా జరగాల్సిన అభివృద్ధి ఇతర కార్యక్రమాల గ్రామంలో కూడావేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి. మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ పున్నారావు. సీనియర్ పార్టీ నాయకులు డి నాగేశ్వరరావు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి. పార్లమెంట్ పార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కేకే రమణ, మండల బిసి యువత అధ్యక్షులు యూనిట్ ఇన్చార్జులు మునయ్య, గుణ యాదవ్, బూత్ కమిటీ కన్వీనర్లు సదాశంకర్, బాలాజీ, పార్టీ నాయకులు కె.వి రమణ, బాలాజీ యాదవ్, గోల్డ్ మాన్ నాయుడు, నారాయణశెట్టి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలపై అవగాహన



**గూడూరు రూరల్ మేజర్ న్యూస్ :** గూడూరు రెండవ పట్టణ పరిధిలోని ఎంవీ నగర్ ప్రాంతంలోనున్న. స్వర్ణాంధ్ర భారతి కళాశాల ప్రాంగణంలో మంగళ వారం రాత్రి జన విజ్ఞాన వేదిక- గూడూరు ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు మూఢనమ్మకాలపై పరీక్ష నిర్వహించి. విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్, జె వి వి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు మెమొంటోలను బహుమతులను అందజేసిన చిరంజీవికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.. విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే సైన్స్ పట్ల అవగాహన కలగాలని. అందుకే అన్ని కాలేజీ లలో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. దురదృష్ట వశాత్తూ భర్త చనిపోయిన స్త్రీ ని ఎదురు రాకూడదని, పెళ్ళిళ్ళకి రాకూడదని చెప్పడం దుర్మార్గమని తెలిపారు. అదే నమ్మకమైతే భార్య చనిపోయిన భర్తలు కూడా శుభకార్యాలకు రాకూడదని తెలిపారు. మదనపల్లె లో ప్రొఫెసర్లు గా ఉన్నవారే కన్న బిడ్డలను దుర్మార్గంగా కొట్టి చంపి మళ్ళీ పుడతారని చెప్పడం మూఢనమ్మకాలకు పరాకాష్ట అని చెప్పారు. అదేవిధంగా 2020 లో కోవిడ్ లాంటి మహమ్మారి వచ్చి ఎంతోమంది చనిపోయినప్పుడు ఈ దొంగ స్వామీజీ లంతా ఏమైపోయారని అలాంటి పరిస్థితుల్లో చదువుకున్నటువంటి డాక్టర్లు అందర్నీ కాపాడగలిగారని ఈ విషయాన్ని ప్రజలందరూ తెలుసుకొని దొంగస్వామీజీలను సమాజం నుంచి తరిమేయాలని పిలుపునిచ్చారు. అలాంటి దొంగ స్వామీజీలను ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని కోరారు. అందుకే చదువుకున్న మీలాంటి విద్యార్థిని, విద్యార్థులు అందరూ మీ మీ గ్రామాల్లో ఇటువంటి విషయాలను ప్రజలందరికీ వివరించి అవగాహన కల్పించాలని. అందుకే మీకు మూఢనమ్మకాలపై పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. భవిష్యత్తు తరంలో మీరే ఈ సమాజం మార్పుకై ప్రయత్నించాలని విద్యార్థులను అందర్నీ కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రామమోహన్, ఆనంద్, సుబ్బారావు, రాధయ్య, రజిని, సుమన్, వెంకటేశ్వర్లు, చిన్నయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# దాతలు ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు యువతిని ఆదుకోండి



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్:** పట్టణం ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేసిన యువతిని ఆదుకోవాలని కోరుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణం దక్షిణ కైలాస నగర్ మహాత్మా గాంధీ వీధిలో నివాసం ఉంటున్న ప్రేమ్ కుమార్ గతంలో హైదరాబాదు ఓ ప్రైవేటు రోడ్డు కాంట్రాక్టు కంపెనీలో సబ్ కాంట్రాక్టు పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు అయితే కంపెనీ చేతులెత్తేయడంతో ప్రేమ్ కుమార్ కు చెందిన జెసిబి మరియు టిప్పర్లను కూడా ఇవ్వకపోవడంతో అప్పుల పాలయ్యాడు దీంతో గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ప్రస్తుతం ఇంట్లోనే ఉంటున్నాడు ఇతనికి ఇద్దరు కుమార్తెలు బి యామిని(28) ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు పీజీ పూర్తి చేసింది ఇటీవల ఈ ఏడాది మార్చి నుంచి అనారోగ్యానికి గురి కావడంతో తిరుపతిలోని స్విమ్స్ లో చికిత్స చేయడంతో రెండు కిడ్నీలు పాడయ్యాయని కిడ్నీలు మార్చాలని వైద్యులు చెప్పడంతో పాటు ఆమెకు పెరిటోరియల్ దయాలసిస్ వైద్యం అందించాలని వైద్యులు పేర్కొన్నారు అయితే సిమ్స్ , వేలూరు లో ఉన్న సిఎంసి ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పడంతో వారు ఆర్థిక స్తోమత లేక ఇంట్లోనే ఉంటున్నారు .కిడ్నీలు మార్పిడికి లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. పెరిటోరియల్ దయాలసిస్ కు గురైన యామినిని దాతలు ఆదుకోవాలని ఆమె ఆరోగ్యం కోసం సహకారం అందించాలని పేర్కొన్నారు. ఆర్థికంగా ఆదుకునే దాతలు 7702852684 (లలితా రాణి) నంబర్ కు ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా ఆదుకోవచ్చని తెలిపారు. యామిని హైదరాబాదులో ఉద్యోగం చేస్తూ ఉండేదిఎం అనంతరం హ్యాండ్లూమ్స్ కంపెనీలో పని చేస్తూ అనారోగ్యానికి గురి కావడంతో కిమ్స్ , అపోలో ఆసుపత్రిలో చికిత్స తీసుకోగా వారు తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రి లేదా వేలూరు లోని సిఎంసి ఆసుపత్రికి తీసుకువెళ్తే ఆరోగ్యం బాగవుతుందని పేర్కొన్నట్లు తెలిపారు ఆర్థికంగా ఆదుకునే వారుపై నెంబర్ను సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు.